
సాక్షి
ఒడిశా
సోమవారం, 31, మార్చి, 2025


శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 6,93,085
బంగారం : 3 గ్రాముల 200 మిల్లీ గ్రాములు
వెండి : 25 గ్రాములు - భువనేశ్వర్/పూరీ


పట్టాలు తప్పిన కామాఖ్య
కామాఖ్య ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పింది. ఒకరు మృతి చెందారు.
- 8లో


బ్యాడ్మింటన్ పోటీలు..
రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఆటగాళ్లు రాణించారు.
- 8లో

న్యూస్‌రీల్

బాలికపై అత్యాచారం కేసులో ఫారెస్టర్ అరెస్టు


ఫారెస్టర్ నరసింహ

రాయగడ: బాలికపై అత్యాచారం కేసులో ఫారెస్టర్‌ను గుడారి పోలీసులు అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. జిల్లాలోని గుడారి అటవీ రేంజ్ పరిధిలో గల కెందుగుడ అటవీ సెక్షన్‌లో ఫారెస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహ శతపతిని శనివారం పోలీసులు అరెస్టు చేశారు. కెందుగుడలో ఉంటున్న ఫారెస్టర్ నరసింహ ఇంటి పొరుగున ఉన్న 12 ఏళ్ల మైనర్ బాలికకు మాయ మాటలు చెప్పి అతని ఇంటి లోపలకు తీసుకువెళ్లాడు. అదే సమయంలో బాలికతో సహా ఉంటున్న మరో బాలిక ఈ విషయాన్ని కుటుంబీకులకు తెలియజేసింది. దీంతో నరసింహ ఉంటున్న నివాసంలోకి వెళ్లిన కుటుంబీకులు మైనర్ బాలికను ఇంటికి తీసుకువచ్చి అతడిని కుటుంబీకులతో పాటు గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు బాధిత కుటుంబం గుడారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఈ మేరకు ఫారెస్టర్‌ను అరెస్టు చేశారు.

విద్యార్థి మృతి


విద్యార్థి మృతదేహం

భువనేశ్వర్: స్థానిక ఉత్కళ విశ్వ విద్యాలయం హాస్టల్‌లో విద్యార్థి ఆదివారం మృతి చెందాడు. మృతుడు క్యాంపస్‌లో మధుసూదన్ హాస్టల్‌లో ఉంటున్నట్లుగా గుర్తించారు. తత్వశాస్త్ర విభాగంలో రెండో సంవత్సరం చదువుతున్నాడు. విద్యార్థి మృతికి కారణాలు తెలియరాలేదు.

385 కేజీల గంజాయి స్వాధీనం


గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాదింబ గ్రామ సమీపంలో గల అటవీ ప్రాంతంలో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉంచిన 385 కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి అక్రమ రవాణా జరుగుతుందన్న సమాచారం మేరకు పోలీసులు బృందంగా ఏర్పడి శనివారం సాయంత్రం దాడులను నిర్వహించారు. పోలీసుల రాకను గమనించిన కొంతమంది గంజాయి బస్తాలను విడిచి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ మేరకు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ సుమారు రూ.5 లక్షల ఉంటుందని అంచనా వేశారు.

ఉగాది సందడి


కవితా పఠనంలో పాల్గొన్న కవులు,రచయితలు


హోమం పూజల్లో పాల్గొన్న డీఆర్ఎం సింఘాల్ దంపతులు


ప్రత్యేక అలంకరణలో మజ్జి గౌరి అమ్మవారు


ఖుర్దారోడ్‌లో ఉరకలేసిన ఉగాది ఉత్సాహం


ఖుర్దారోడ్‌లో సంప్రదాయ కట్టుబొట్టుతో మహిళల ఉత్సాహం


అమ్మవారి దర్శనం కోసం బారులు తీరిన భక్తులు


ఖుర్దారోడ్‌లో వయో వృద్ధుని సినీ సంగీతాలాపన

రాయగడ: ఉగాది సందర్భంగా స్థానిక రామలింగేశ్వర మందిరం ప్రాంగణంలో జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ సౌజన్యంతో స్పందన, రాయగడ రచయితల సంఘం, కళాసృష్టి సంస్థల ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం, కవితా గోష్ఠి కార్యక్రమాలు ఆదివారం నిర్వహించారు. ముందుగా గణపతి శర్మ, ఆర్.శ్రీరామ శర్మల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు, పంచాంగ శ్రవణాలు జరిగాయి. అనంతరం స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ కార్యదర్శి పతివాడ తులసీ దాస్ నేతృత్వంలో కవితా పఠనం జరిగింది. కవులు, రచయితలు ఈ సందర్భంగా వారి కవితలు చదివి వినిపించారు. స్పందన అధ్యక్షులు గుడ్ల గౌరీ శంకర్, రాయగడ రచయితల సంఘం అధ్యక్షులు టీవీఎస్ఆర్ అప్పారావు, కళాసృష్టి సంస్థ అధ్యక్షులు మహేష్ పట్నాయక్, కవి, రచయిత భళ్లమూడి నాగరాజు, బాలకృష్ణ పట్నాయక్, కేకేఎం పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సాయిప్రియ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రైల్వే గ్రౌండ్ వద్ద ఉగాది సందర్భంగా నిర్వహించిన హోమంలో రాయగడ రైల్వే డివిజనల్ (డీఆర్ఎం) మేనేజరు అమితాబ్ సింఘాల్ దంపతులు కూర్చుని పూజా కార్యక్రమాలను నిర్వహించారు. మజ్జిగౌరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారి దర్శనం కొసం బారులు తీరారు.

దక్షిణ భారత బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: దక్షిణ బ్రాహ్మణ సంఘం సభ్యులు కలిసికట్టుగా ముందుడి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని అధ్యక్షుడు డాక్టర్ ఆర్.ఆర్.రవి అన్నారు. స్థానిక జంగంవీధి జంక్షన్‌లో ఉన్న సింహాద్రి ఫంక్షన్ హాలులో శ్రీవిశ్వావసు నామ ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా శ్రీ కృష్ణచంద్ర గజపతి స్వయం ప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జితేంద్రనాథ్ పట్నాయిక్ విచ్చేసి జ్యోతిని వెలిగించి ప్రారంభించగా, సంఘం ఉపాధ్యక్షులు మరువాడ శివరామకృష్ణ, డాక్టర్ రామలక్ష్మీ తదితరులు వేదికను అలంకరించారు. ముందుగా కార్యక్రమంలో ఉగాది పంచాంగాన్ని వేదంభట్ల వేంకటరమణమూర్తి చదివి వినిపించారు. అనంతరం దక్షిణ బ్రాహ్మణ సంఘం తరపున ముఖ్యఅతిథి ప్రిన్సిపల్ జితేంద్రనాథ్ పట్నాయిక్, ఇవటూరి వేంకట సూర్యనారాయణ మూర్తి దంపతులకు ఆత్మీయ సత్కారాన్ని డాక్టర్ ఆర్.ఆర్.రవి చేతులమీదుగా అందజేశారు. అలాగే వ్యాసరచన,భగవద్గీత శ్లోకాల పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం నాట్యకారులు హిమగిరి నేతృత్వంలో కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దక్షిణభారత సంఘం కన్వీనరు వెల్లంకి కూర్మనాథం, చెట్టి వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో..

జయపురం: జయపురం ఆర్ఎస్ఎస్ వారు ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో ఆర్ఎస్ఎస్ పరిచాలకుడు ప్రేమానంద నాయిక్, ఇంజనీర్ శుభ్రత కుమార్ మిశ్రాలు అతిథులుగా పాల్గొన్నారు.


ఖుర్దారోడ్‌లో బాలికల వర్గం ఉగాది ప్రతిభ


ఖుర్దారోడ్‌లో ఉగాది ఉత్సవంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శన


ఖుర్దారోడ్‌లో అతిథి కళాకారుల సంగీత విభావరి


పర్లాకిమిడి: వేదంభట్ల వేంకటరమణ మూర్తి పంచాంగ పఠనం


పర్లాకిమిడి: ప్రిన్సిపాల్ జితేంద్రనాథ్ పట్నాయిక్‌ను సత్కరిస్తున్న రవి


పర్లాకిమిడి: ఆర్.ఆర్.రవిని సత్కరిస్తున్న మరువాడ శర్మ


పర్లాకిమిడి: దక్షిణ బ్రాహ్మణసంఘం తరపున వేదంభట్ల వేంకటరమణ మూర్తిని సత్కరిస్తున్న డాక్టర్ రవి


జయపురం: ఆర్ఎస్ఎస్ నిర్వహించిన ఉగాది పండగలో పాల్గొన్న కార్యకర్తలు


జయపురం: సూర్య నమస్కార విన్యాసాలు

నూతన పంచాంగం ఆవిష్కరణ

రాయగడ: స్థానిక ఉత్కళ ఆంధ్రా బ్రాహ్మణ సేవా సమాజం వారు ఉగాది సందర్భంగా రూపొందించిన నూతన పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఆదివారం సాయంత్రం స్థానిక వేంకటేశ్వర కల్యాణ వేంకటేశ్వర ఆలయ దీప మండపంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాజం అధ్యక్షులు రేజేటి శ్రీనివాస్ శర్మ, కార్యదర్శి భళ్లమూడి నాగరాజు, ఉపాధ్యక్షుడు అవసరాల నారాయణమూర్తి, కోశాధికారి తేన్నేటి సీతారామ మూర్తి, పీవీ భాస్కరాచార్యులు, పి.గణపతి శాస్త్రి, రేజేటి శ్రీరామ శర్మ సభ్యులు పాల్గొన్నారు.


పంచాంగం ఆవిష్కరణ చేస్తున్న సమాజం సభ్యులు

ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది ర్యాలీ


కలశాలను మోసుకుంటూ తీసుకువస్తున్న మహిళలు

రాయగడ: జేకేపూర్ రోడ్డుకు వెళ్లే మార్గంలో గల కొల్లిగుడ మైదానంలో ఉత్కళ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఉగాది వేడుకలకు శ్రీకారం చుట్టారు. వేడుకల్లో భాగంగా స్థానిక మజ్జిగౌరి మందిరం నుంచి ఆదివారం మధ్యాహ్నం జరిగిన కలశ యాత్రలో సమాఖ్య అధ్యక్షులు యాళ్ల కొండబాబు, అతని మద్దతు దారులు పాల్గొన్నారు.


కలశ యాత్రలో పాల్గొన్న కొండబాబు అతని మద్దతుదారులు

భక్తిశ్రద్ధలతో కలశ యాత్ర

- జాతరలో పాల్గొన్న సినీనటి నటాషా


కలశాన్ని పట్టుకున్న సినీనటి నటాషా, పక్కనే నెక్కంటి భాస్కరరావు

రాయగడ: స్థానిక తేజస్వీ మైదానంలో నెక్కంటి భాస్కరావు ఆధ్వర్యంలో రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ పేరిట నిర్వహిస్తున్న ఉగాది సంబరాలు ఆదివారం నిర్వహించారు. మజ్జిగౌరీ మందిరం నుంచి నిర్వహించిన కలశ యాత్రలో సినీనటి నటాస పాల్గొన్నారు. ఈ యాత్రలో ఆమె కలశాన్ని పట్టుకుని కొద్ది దూరం నడిచారు. జనతాకిడి ఎక్కువగా ఉండటంలో వెంటనే టాప్‌లెస్ వాహనం ఎక్కి ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీలో భాగంగా తప్పిటగుళ్ల, పులి వేషాలు, సంప్రదాయ నృత్యాలు, హరేరామ సంకీర్తనలతో ర్యాలీ కొనసాగింది. అడుగడుగునా మజ్జిగ, తాగునీటి సౌకర్యాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. వేదిక వరకు ర్యాలీ నిర్వహించారు.


తప్పెటగుళ్ల సందడి


ఆకట్టుకున్న పులివేషధారులు


కలశ యాత్రలో పాల్గొన్న జనం

పురిటిగూడలో ఏనుగుల బీభత్సం

- కర్బూజా, అరటి, తదితర పంటలు ధ్వంసం


కాశీనగర్ సమితి పురుటిగుడలో ఏనుగులు


పురుటిగుడలో తిరుగుతున్న ఏనుగుల గుంపు

పర్లాకిమిడి: కాశీనగర్ సమితి ఖండవ పంచాయతీ పురుటిగుడ గ్రామంలో రెండు రోజులుగా నాలుగు ఏనుగులు తిష్టవేసి బీభత్సం సృష్టించాయి. కర్బూజా, అరటి, మొక్కజొన్న, చోడిపంట, జీడి తోటలను ఆదివారం ధ్వంసం చేశాయని పురుటిగుడ రైతులు రొక్కం శ్రీనివాసు, మేడిబోయిన రమేష, రొక్కం ప్రభాకర్, ఉదాన రామన్నలు ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టాన్ని అటవీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు గ్రామం, వంశధార పరివాహక ప్రాంతం పురటిగుడకు శ్రీకాకుళం జిల్లా భామిని మండలం సింగిడి, విల్లమడ గ్రామాల నుంచి ఏనుగులు వచ్చి కర్బూజా పంటను ధ్వంసం చేశాయన్నారు. అరటి, కర్బూజా పంటలను ధ్వంసం చేయడంతో సుమారు రూ.4లక్షలు నష్టం సంభవించిందని రైతులు తెలిపారు. దీనిపై అటవీ అధికారులు స్పందిస్తూ పురుటిగుడలో పంట నష్టంపై ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు.


ధ్వంసం చేసిన అరటి పంట


ఖండవ పంచాయతీ పురుటిగుడలో ధ్వంసమైన కర్బూజా పంట

క్లుప్తంగా

శిశు విద్యామందిర్‌లో ఉగాది వేడుకలు



సంఘ్ పరిచాలక్ డాక్టర్ భగవాన్ త్రిపాఠిని గౌరవిస్తున్న అతిథులు

పర్లాకిమిడి: స్థానిక సరస్వతీ శిశు విద్యామందిర్‌లో ఆదివారం అఖిలభారత సాహిత్యపరిషత్ గజపతి జిల్లా ఆధ్వర్యంలో మహేంద్రతనయ సాహిత్య సంసద్, సరస్వతీ శిశు విద్యామందిర్ ఆధ్వర్యంలో నూతన సంవత్సరం ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యఅతిథిగా గంజాం జిల్లా ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ చాలక్ డాక్టర్ భగవాన్ త్రిపాఠి పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో సంఘ్ పరివార్ కలిసి భారతదేశాన్ని పటిష్టపరిచి శక్తివంతంగా యువత చేయాలని పిలుపు నిచ్చారు. ప్రొఫెసర్ కళ్యాణీ మిశ్రా సహకారంతో వేడుకలు జరుపగా, గౌరవ అతిధులుగా చంద్రశేఖర పట్నాయక్, ఆచార్య సరోజ్ పండా పాల్గొన్నారు. విద్యార్థినులు ఆయుషీ అస్మితా, మరియు బేబి బిశ్వాల్ ఉగాది ప్రాధాన్యతను వివరించారు.

అలరించిన గాన కచేరి



పాటలు పాడుతున్న రఘునాథ పాత్రో, స్పందనా పండా

పర్లాకిమిడి: సినీ గాయకులు, రాష్ట్ర జయదేవ్ సమ్మాన్ పురస్కార గ్రహీత స్వర్గీయ రఘునాథ పాణిగ్రాహి స్మృతి చరణ ఉత్సవాన్ని స్థానిక టౌను హాలులో శనివారం రాత్రి ఒడిశా సంగీత నాటక అకాడమి, భక్తి నైవేద్య సంస్కృతి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా తెలుగులో చల్లని రాజా.. ఓ చందమామా..అనే పాటను ఇలవేల్పు సినిమాలో.. పి.సుశీల, పి.లీలతో కలిసి రఘునాథ పాణిగ్రాహి పాడగా సుసర్ల దక్షిణామూర్తి సంగీతం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బిజయకుమార్ దాస్, శ్రీక్రిష్ణచంద్రగజపతి కళాశాల ప్రిన్సిపాల్ జితేంద్రనాథ్ పట్నాయక్, దూరదర్శన్ గాయకులు రఘునాథ పాత్రో, డాక్టర్ చందన్ పట్నాయక్, జిల్లా సాంస్కృతిక అధికారి అర్చనా మంగరాజ్‌లు హాజరయ్యారు. 1932 ఆగస్టు 10న రాయగడ సమితి గుణుపురంలో జన్మించిన గాయకులు రఘునాథ పాణిగ్రాహి 2013 ఆగస్టు 25న మృతి చెందారు. ఒడియా, తెలుగు, తమిళంలో అనేక పాటలు పాడిన రఘునాథ పాణిగ్రాహి స్మృతి చిహ్నంగా గానకచేరి ఏర్పాటు చేశారు. ఆకాశవాణి కళాకారులు డాక్టర్ చందన్ గంతాయత్ నేతృత్వంలో అశుతోష్ మిశ్రా, అమృత పురోహిత్, బిరాజినీ శోబోరో, స్పందనా పండా, గోపాలకృష్ణ నాహక్ తదితరులు రఘునాథ పాణిగ్రాహి పాడిన పాటలను వినిపించారు.

పారదర్శకంగా విచారణ చేపట్టాలి

శ్రీకాకుళం కల్చరల్: డాక్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పారదర్శకంగా విచారణ చేపట్టాలని జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, జిల్లా క్రైస్తవ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు. ఈ మేరకు నగరంలోని గరల్స్ హైస్కూల్ ఎదురుగా ఉన్న క్రిస్టియన్ వర్షిప్ సెంటర్ నుంచి కొన్నావీధిలో ఉన్న కీస్టోన్ చర్చి వరకు శాంతియుత ర్యాలీ ఆదివారం చేపట్టారు. అనంతరం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ ప్రవీణ్ ప్రగడాలది ప్రమాదం కాదని, ఎవరో హత్య చేశారని అనుమానం వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ చైర్మన్ డీఎస్‌వీఎస్ కుమార్, ఎస్‌ఎంయూపీఎఫ్ ప్రెసిడెంట్ రెవ.జాన్ జీవన్, సెక్రటరీ సీహెచ్ ప్రేమన్న, బిషప్ సామ్యూల్ మొజెస్, రెవ.పి.ఎస్.స్వామి, బిషప్ బి.బర్నబస్ తదితరులు పాల్గొన్నారు.

పట్టాలు తప్పిన కామాఖ్య ఎక్స్‌ప్రెస్

- కటక్ నెర్గుండి సమీపంలో దుర్ఘటన
- ప్రాణహాని శూన్యం: డీఆర్‌ఎం



చెల్లా చెదురైన బాధిత ప్రయాణికులు

భువనేశ్వర్: బెంగళూరు – కామాఖ్య ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఆదివారం పట్టాలు తప్పి ప్రమాదానికి గురైంది. తూర్పు కోస్తా రైల్వే ఖుర్దా రోడ్ మండలం కటక్ మార్గంలో నెర్గుండి స్టేషన్ సమీపంలో సుమారు 11.54 గంటలకు పట్టాలు తప్పింది. ఈ దుర్ఘటనలో ఎలాంటి గాయాలు లేదా ప్రాణ హాని సంభవించలేదని స్థానిక మండల రైల్వే అధికారి డీఆర్‌ఎం హెచ్‌ఎస్ బాజ్వా తెలిపారు. డౌన్ లైన్ మాత్రమే ప్రభావితమైంది. ఈ నేపథ్యంలో మెయిల్ ఎక్స్‌ప్రెస్ ప్రయాణికుల రైళ్లు అప్‌లైన్‌లో తాత్కాలికంగా నడిపించారు.

ప్రమాదం సమాచారం అందడంతో తూర్పు కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ మరియు ఖుర్దా రోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్‌ఎం), ఇతర సీనియర్ రైల్వే అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. సహాయ, పునరుద్ధరణ చర్యలను సమన్వయం చేశారు. ప్రమాదంలో చిక్కుకున్న ప్రయాణికులను వారి గమ్యస్థానాలకు తరలించడానికి ప్రత్యేక రైలును ఏర్పాటు చేశారు. ఘటనా స్థలంలో బాధిత ప్రయాణికులకు తాగు నీరు, అల్పాహారం మరియు ఆహార పొట్లాలను పంపిణీ చేశారు.



కామాఖ్య ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన దృశ్యం

ప్రమాదంలో ఒకరి మృతి

కామాఖ్య ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పిన దుర్ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయం కటక్ జిల్లా మేజిస్ట్రేట్ దత్తాత్రయ భౌసాహెబ్ షిండే తెలిపారు. మరో 8 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉన్నత చికిత్స కోసం వీరందరినీ కటక్ ఎస్‌సీబీ వైద్య బోధన ఆస్పత్రికి తరలించారు. వీరి ఆరోగ్య పరిస్థితి స్థిమితంగా ఉన్నట్లు అధికార వర్గాల సమాచారం. మృతుడిని ఆలీపూర్ ప్రాంతీయుడు శుభంకర్ రాయ్‌గా గుర్తించారు. కుటుంబీకులతో కలిసి బెంగళూరు నుంచి తిరిగి వస్తుండగా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. తన తల్లి హృద్రోగ చికిత్స కోసం బెంగళూరు తీసుకుని వెళ్లి తిరిగి వస్తుండగా ఇలా జరగడం విచారకరం.

రైళ్ల దారి మళ్లింపు

ఈ ప్రమాదంతో రైల్వే రవాణా ప్రభావితం అయింది. ప్రయాణికుల అసౌకర్యం తొలగించేందుకు దిగువ దిశలో భువనేశ్వర్ నుంచి భద్రక్ వైపు వెళ్లే రైళ్లను బారంగ్ – నెర్గుండి – కపిలాస్ రోడ్ ద్వారా మళ్లించి నడిపించారు. ఈ జాబితాలో రైళ్ల వివరాలు..

- 12822 పూరీ – హౌరా ధౌలీ ఎక్స్‌ప్రెస్
- 12875 పూరీ – ఆనంద్ విహార్ నీలాచల్ ఎక్స్‌ప్రెస్
- 22606 తిరునెల్‌వెలి – పురులియా ఎక్స్‌ప్రెస్
- 12704 సికింద్రాబాద్ – హౌరా ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్
- 12513 సికింద్రాబాద్ – సిల్చార్ ఎక్స్‌ప్రెస్

అధికారులతో సంప్రదించిన పీసీసీ చీఫ్

ఒడిశా ప్రదేశ్ కాంగ్రెసు కమిటి అధ్యక్షుడు భక్త చరణ్ దాస్ ఘటనా స్థలం సందర్శించారు. అక్కడి సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాలకు సంబంధించి ఖుర్దారోడ్ మండల రైల్వే అధికారి డీఆర్‌ఎం హెచ్. ఎస్. బాజ్వాతో ముఖాముఖి సంప్రదించి బాగోగులు పర్యవేక్షించారు. కేంద్ర రేంజ్ ఇనస్పెక్టరు జనరల్ ప్రవీన్ కుమార్, కటక్ గ్రామీణ పోలీసు సూపరింటెండెంటు పీఆర్‌ఎస్ ప్రతీక్, కటక్ చౌద్వార్ నియోజక వర్గం ఎమ్మెల్యే సౌవిక్ బిశ్వాల్ ప్రమాద స్థలం సందర్శించారు.

ప్రయాణికుల సహాయం కోసం హెల్ప్‌లైన్ నంబర్లు

భువనేశ్వర్:	7205149591, 8455885999
కటక్:	8991124238
ఖుర్దా రోడ్:	06742492245
భువనేశ్వర్:	8114382371
భద్రక్:	9437443469
పలాస:	9237105480
జాజ్‌పూర్ కెంజొహార్ రోడ్:	9124639558



పట్టాలు తప్పి పక్కకు ఒరిగిన కామాఖ్య ఎక్స్‌ప్రెస్ రైలు బోగీలు

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



రాష్ట్ర స్థాయి పోటీలను నిర్వహిస్తున్న డీపీ బ్యాడ్మింటన్ అకాడమీ టీమ్



బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న తహసీల్దార్, తదితరులు



సింగిల్స్‌లో తలపడుతున్న ఆటగాళ్లు



ఒకేసారి రెండు, మూడు మ్యాచ్‌లు ఆడేందుకు ఏర్పాటు చేసిన కోర్టులు

జయపురం: స్థానిక ఆదర్శనగర్‌లో గల డీపీ బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియంలో శనివారం రాత్రి రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలను జయపురం తహసీల్దార్ సచిన్ ప్రదాన్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను సంబోధిస్తూ మానవ జీవితంలో క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలు శారీరక, మానసిక వికాసానికి దోహద పడతాయన్నారు. పోటీల్లో పాల్గొన్నవారు గెలుపు, ఓటములను ఒకేలా స్వీకరించాలన్నారు. జయపురం మున్సిపాలిటీ సహాయ కార్యనిర్వాహక అధికారి కృతిబాస్ సాహు, మున్సిపాలిటీ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి, గౌరవ అతిథిగా హాజరయ్యారు. తొలిరోజు 47 సింగిల్స్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీల్లో 94 మంది క్రీడాకారులు పాల్గొన్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఒకేసారి మూడు మ్యాచ్‌లు ఆడేందుకు కోర్టులను ఏర్పాటు చేశారు. ప్రతి క్రీడాకారుడు మూడు మ్యాచ్‌లు చొప్పున ఆడినట్లు వెల్లడించారు. వారిలో ఎవరైతే రెండు మ్యాచ్‌లలో విజయం సాధించారో వారు తదుపరి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. ఈ పోటీలు అయిన తరువాత డబుల్స్ పోటీలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ పోటీలలో రాష్ట్ర బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన రిఫరీ లక్షపతి నందా, పోటీల పర్యవేక్షకులుగా సందీప్ మిశ్ర వ్యవహరించారు. డీపీ బ్యాడ్మింటన్ అకాడమీ సభ్యులు నిమయి చరణదాస్, గౌరీ శంకర పట్నాయక్, దేవదాస్, సుబ్రత్ పండా, శైలేంద్రకుమార్ చౌదరి, సంతోష్ బెవర్త, కృష్ణచంద్రదాస్, ఆశిత్ పట్నాయక్ సహకరించారు.

అనుమానాస్పదంగా ఉద్యోగి మృతి

రణస్థలం: మండలంలోని బంటుపల్లి పంచాయతీ పరిధిలో ఉన్న యూనైటెడ్ బ్రూవరీస్ పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగి పిన్నింటి అప్పలసూరి(47) అనుమానాస్పదంగా మృతి చెందాడు. జేఆర్‌పురం పోలీసులు, పరిశ్రమ వర్గాలు తెలిపిన వివరాల మేరకు.. ఆదివారం జనరల్ డ్యూటీకి వెళ్లిన మృతుడు అప్పలసూరి సాయంత్రం 4.30 గంటల సమయంలో పరిశ్రమలోని వాష్ రూమ్‌లో ప్లాస్టిక్ పైపునకు ప్యాకింగ్ రోప్‌తో ఉరి వేసుకుని చనిపోయి ఉన్నాడు. కొంత సమయం తర్వాత గుర్తించిన తోటి ఉద్యోగులు జేఆర్‌పురం పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈయన పరిశ్రమలోని కేస్ ప్యాకర్ మిషన్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బంటుపల్లి పంచాయతీ ప్రజలకు ఆర్‌ఎంపీగా వైద్య సేవలు అందిస్తుంటాడని గ్రామస్తులు చెబుతున్నారు. అయితే ఉరివేసుకుని చనిపోయి ఉండడంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతునికి భార్య అమ్ములు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడు స్వగ్రామం నరసన్నపేట దగ్గర లుకలాం కాగా, గత 30 ఏళ్లుగా ఉద్యోగరీత్యా జేఆర్ పురం పంచాయతీలోని జీఎంఆర్ కాలనీలో నివాసముంటున్నాడు. జేఆర్‌పురం ఎస్‌ఐ ఎస్.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ఉరికి వేలాడుతున్న అప్పలసూరి మృతదేహం

వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ

కంచిలి: ఇంట్లోని వెనుక గదిలో నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని నాలుగు తులాల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని మండపల్లి పంచాయతీ పరిధి అమ్మవారిపుట్టుగ గ్రామానికి చెందిన బొడ్డ అమ్మాయమ్మ అనే వృద్ధురాలు తన ఇంట్లోని వెనుక గదిలో శనివారం రాత్రి నిద్రించింది. ఇంటి పెరడు వైపు వెనుక గది తలుపునకు గడియ లేదు. దీంతో నైలాను తాడును తలుపు చెక్కలకు కట్టి వృద్ధురాలు నిద్రపోయింది. అయితే అర్ధరాత్రి ఒంటి గంటన్నర సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పెరడు తలుపునకు కట్టిన తాడును విప్పి వృద్ధురాలు నిద్రిస్తున్న గదిలోకి ప్రవేశించాడు. అనంతరం ఆమె మెడలో వేసుకొన్న బంగారు పుస్తెలతాడును తెంచుకొని పారిపోయాడు. దీన్ని గమనించిన వృద్ధురాలు కేకలు వేసింది. తర్వాత కుటుంబ సభ్యులు నిద్రలేచే వచ్చేసరికి దుండగుడు పారిపోయాడు. ఈ విషయమై వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంచిలి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కంచిలి ఎస్‌ఐ పి.పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జయపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా సరోజ్‌దాస్



అధ్యక్షునిగా గెలుపొందిన అశోక్ కుమార్ మిశ్ర



కార్యదర్శిగా నియమితులైన సచ్చిదానంద మిశ్ర



కోశాధికారిగా గెలుపొందిన శైలేష్ మదల



గ్రంథాలయ కార్యదర్శిగా నియమితులైన జుగల్ కిశోర్ పట్నాయక్



విజయోత్సవాన్ని జరుపుకుంటున్న అసోసియేషన్ సభ్యులు

జయపురం: జయపురం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా అశోక్ దాస్ ఎన్నిక్యయ్యారు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారి దాసరథి పట్నాయక్ శనివారం రాత్రి వెల్లడించారు. శనివారం ఎన్నికలు జరిగిన తరువాత సాయంత్రం ఓట్ల లెక్కింపు ప్రారంభించారు. రాత్రి తొమ్మిది గంటల సమయానికి ఓట్ల లెక్కిపుపూర్తయిన తరువాత ఫలితాలను వెల్లడించారు. 587 మంది ఓటర్లు గల అసోసియేషన్‌లో 497 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సరోజ్ కుమార్‌దాస్‌కు 269 ఓట్లు రాగా తన సమీప ప్రత్యర్థి త్రినాత్ సింగ్‌లాల్‌కు 172, అజయ కుమార్ సాహుకు 52 ఓట్లు వచ్చాయి. అలాగే కార్యదర్శి పదవికి పోటీ చేసిన సచ్చిదానంద మిశ్ర 308 ఓట్లు పొంది విజయం సాధించగా ప్రత్యర్థి శరత్ కుమార్ మఝికి 187 ఓట్లు వచ్చాయి. జాయింట్ కార్యదర్శిగా భోలానాద్ పట్నాయక్ ,సహాయ కార్యదర్శిగా అంజనసింగ్ ఏకగ్రీవగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నవీణ చంద్రసాహు, కోశాధికారిగా శైలేష్ కుమార్ మదల, గ్రంథాలయ కార్యదర్శిగా జుగల్ కిశోర్ పట్నాయక్, గ్రంథాలయసహాయ కార్యదర్శిగా రాఖి భాయి, కార్యవర్గ సభ్యులుగా ఆకాశ్ కులదీప్, పొన్నగంటి శంకరరావు, సచిన్ కుమర్ పాఢి, సురేష్ కుమార్ సెట్టి, తాపస్ పండ, తరణి పాణిగ్రహి, విశ్వనాథ్ ఆచారి ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకునిగా రాష్ట్ర బార్‌కౌన్సిల్ సభ్యులు పిట్టా రమేష్ పాత్రో వ్యవహరించారు. ఫలితాలు అనంతరం పట్టణంలో ర్యాలీ చేశారు.

సెంచూరియన్ వర్సిటీలో రేపటి నుంచి ఏఐయూ సమావేశాలు


పర్లాకిమిడి: జాతీయ మహిళా విద్యార్థి సంఘం సంఘటితం కోసం ఏప్రిల్ ఒకటి నుంచి ఐదో తేదీ వరకూ పర్లాకిమిడిలోని సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్‌లో ద్వితీయ భారతీయ విశ్వవిద్యాలయాల సంఘం (ఏఐయూ) జాతీయ మహిళా విద్యార్థుల సంఘం సమావేశాలు జరగనున్నాయి. ఈ విషయాన్ని క్యాంపస్ డిప్యూటీ రిజిస్ట్రారు డాక్టర్ దుర్గాప్రసాద్ పాఢి ఆదివారం తెలిపారు. వార్షిక విద్యాసంవత్సరం 2024–25 సందర్భంగా 'సదృఢ భవిష్యత్, సామూహిక స్వరం, వికసిత్ భారత్' న్యూఢిల్లీ అసోసియేషన్ ఆఫ్ ఇండియాన్ యూనివర్సిటీలు (ఏఐయూ) ఆదేశాల మేరకు జరుగనున్నట్లు అధికారులు తెలియజేశారు.

కొబ్బరి రైతు కుదేలు..!

- వర్షాభావం, తెగుళ్ల తాకిడితో ఇబ్బందులు
- పడిపోయిన దిగుబడులు
- వలసబాట పడుతున్న రైతులు, కూలీలు



తెల్లదోమ ఆశించిన కొబ్బరి చెట్లు



కంచిలి: ఉద్దానం ప్రజల జీవనాధారంగా ఉన్న కొబ్బరి పంటకు తీవ్రమైన తెగుళ్లతో రైతు కుదేలవుతున్నాడు. గడిచిన నాలుగేళ్లుగా వర్షాభావ పరిస్థితులు, అంతకుముందు తిత్లీ తుఫాన్ ప్రభావం వెరసి కొబ్బరి పంటపై తెగుళ్ల దాడి తీవ్రతరమైంది. అలాగే భూసారం తగ్గి దిగుబడులు గణనీయంగా పడిపోయాయి. తాజాగా మళ్లీ తెల్లదోమ ఉధృతి పెరగడంతో మరింతగా దిగుబడులు తగ్గిపోయాయి. దోమ నివారణకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో కొబ్బరి పంటే జీవనాధారంగా ఉన్న బతుకులు అగమ్యగోచరమయ్యాయి. దిగుబడులు లేకపోవడంతో రైతుతోపాటు, అందు లో పనిచేసే కూలీల కుటుంబాలు కూడా పని దొర క్క ఇబ్బందులు పడుతున్నాయి. మొదట్లో కూలీలకు పని దొరక్క వలసలు ప్రారంభం కాగా, ఇప్పు డు దిగుబడులు లేకపోవడంతో రైతులు కూడా ప్రత్నామ్నాయ జీవనానికి వలస బాట పడుతుండడం ఇక్కడి తీవ్రత తెలియజేస్తోంది.

మట్టిలో తగ్గిన సాంద్రత

ఉద్దాన ప్రాంతంలో వర్షాభావ పరిస్థితులతో మట్టి సాంద్రత చాలా వరకు తగ్గినట్లు స్పష్టమవుతోంది. దీనివలన కొత్తగా కొబ్బరి మొక్కలు వేస్తున్నప్పటికీ ఎదుగుదల తక్కువగా ఉంది. అలాగే వాటికి తెల్లదోమ ఆశించడం వలన కూడా చనిపోతున్నాయని రైతులు వాపోతున్నారు. ఒక ఎకరాకు 20 నుంచి 30 మొక్కలు నాటుతుంటే, వాటిలో నాలుగైదు కూడా బతకడం కష్టంగా ఉందంటున్నారు. చీడపీడల నివారణకు శాస్త్రవేత్తలు, నిపుణులు సలహాలు అందకపోవడం వలన మరింత నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్థానికంగా కొబ్బరి పరిశోధన కేంద్రం లేకపోవడం, ఇటీవల సోంపేటలో ఏర్పాటు చేసిన బదనికల కేంద్రం కూడా ఎత్తివేయడంతో రైతుకు ఉద్యానశాఖ పరంగా ఎటువంటి భరోసా లేని దుస్థితి ఏర్పడింది.



అంతరపంట జీడిపై ప్రభావం

కొబ్బరికి ఆశించిన తెగుళ్ల కారణంగా దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి. తిత్లీ తుఫాన్‌కు ముందు ఒక ఎకరాలకు 10 పనాలు(80 కాయలు ఒక పనం) దిగుబడి వస్తే, ప్రస్తుతం ఒకటిన్నర నుంచి రెండు పనాలు మాత్రమే వస్తోంది. దిగుబడులు తగ్గిపోవడం వలన వచ్చిన కాయలను పక్కనే ఉన్న ఒడిశా మార్కెట్‌కు వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. కొబ్బరికి ఆశించిన పురుగులే, అంతర పంటగా ఉన్నటువంటి జీడికి కూడా ఆశించడం వలన వాటి దిగుబడులు పైన కూడా ప్రభావం చూపుతోంది. ఈ మధ్య కాలంలో తీవ్రమైన మంచు కురవడం, పురుగుల తాకిడి వలన వాటి దిగుబడులు కూడా తగ్గాయని రైతులు వాపోతున్నారు.

వలస పురుగుల ప్రభావం


ఉద్దానం ప్రాంతానికి చెందిన కొందరు కొబ్బరి వ్యాపారులు ఉభయ గోదావరి జిల్లాల నుంచి కాయలను దిగుమతి చేసుకొని, ఇక్కడ తోటల్లో నిల్వ చేసి, ఎగుమతులు చేయడం వలన ఆ ప్రాంతం నుంచి తెల్లదోమ తదితర పురుగులు వలస వచ్చాయని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విమర్శలు చాలాకాలంగా వస్తున్నప్పటికీ సంబంధిత వ్యాపారులు మాత్రం అవేవీ పట్టించుకోవడం లేదు. అక్కడి కాయలు చవగ్గా వస్తున్నాయని దిగుమతి చేసుకొని, ఇక్కడి కాయలతో కలిపి ఎగుమతులు చేస్తున్నారని అంటున్నారు.

అవగాహన అవసరం



ఉద్దానం ప్రాంతంలో కొబ్బరికి ఆశించిన తెగుళ్లను నివారించడానికి రైతులంతా ఉద్యానశాఖ సలహాలు తీసుకొని మూకుమ్మడిగా నివారణ చర్యలు చేపట్టాలి. పెద్దపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో బదనకలు అందుబాటులో ఉన్నాయి. రైతులు వీటిని మూకుమ్మడిగా వినియోగించి నివారణ చర్యలు చేపట్టాలి. రసాయన ఎరువుల జోలికి వెళ్లకూడదు. వేపనూనె పిచికారీ చేయడం వంటి చర్యలతో కొంతమేర ఉపశమనం కలుగుతుంది.
– పి.మాధవీలత, ఉద్యానశాఖ అధికారి, కవిటి

వలసబాట పడుతున్నారు



గతంలో ఎంతోబాగా దిగుబడులు వచ్చేవి. కానీ గత కొన్నేళ్లుగా వర్షాభావం, తెగుళ్ల తాకిడి కారణంగా దిగుబడులు తగ్గిపోయాయి. ఇలాగే పరిస్థితి కొనసాగడంతో గతంలో పనుల్లేక కూలీలు వలసబాట పట్టారు. ఇప్పుడు మరలా ఎంతోమంది చిన్న రైతులు వలసబాట పడుతున్నారు. పరిస్థితి చూస్తుంటే ఆవేదనగా ఉంది.
– ప్రధాన లజపతి, కొబ్బరి రైతు, పెద్దకొజ్జిరియా గ్రామం

పరిస్థితి దారుణంగా ఉంది



అధికారులు తెగుళ్ల నివారణ చేపట్టకపోవడంతో ఉద్దాన ప్రాంతంలో కొబ్బరి పంటల పరిస్థితి దారుణంగా ఉంది. తిత్లీ తుఫాన్ తర్వాత తోటల్లో కొబ్బరి చెట్లు చాలా వరకు దెబ్బతిన్నాయి. అనంతరం ఇప్పుడు ఈ తెగుళ్ల ఉధృతి విపరీతంగా పెరగడంతో రైతు కోలుకోవడం కష్టంగా మారింది. ప్రభుత్వం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టకపోతే రైతులు నష్టాల్లో కూరుకుపోతారు.
– పలికల జయరాం, కొబ్బరి రైతు, జాడుపూడి గ్రామం

క్లుప్తంగా

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి..


రథాన్ని లాగుతున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: శ్రీరామచంద్రుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని మాజీ డిప్యూటీ సీఎం, మాజీ గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ఆకాంక్షించారు. పట్టణంలోని వెలమపేట, డబ్బివీధి, తదితర ప్రాంతాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సీతారాముల విగ్రహాలను రథంలో ఉంచి మేళతాళాల నడుమ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పీడిక రాజన్నదొర పాల్గొని రథం లాగారు. ఈ సమయంలో భక్తులు జై శ్రీరామ్ అంటూ నినాదాలు చేయడంతో ఆ ప్రాంతం మార్మోగిపోయింది.

బైక్ రికవరీ

పార్వతీపురం రూరల్: రెండు రోజుల వ్యవధిలో పోయిన బైక్‌ను పోలీసులు రికవరీ చేశారు. పార్వతీపురం రూరల్ ఎస్సై బి. సంతోషి తెలియజేసిన వివరాల మేరకు.. ఈ నెల 28న పార్వతీపురం రూరల్ పరిధి వైకేఎం కాలనీలోని ఓ కిరాణా దుకాణం వద్ద పార్క్ చేసిన పల్సర్ ఎన్ఎస్ 200 ద్విచక్ర వాహనాన్ని ఎవరో దొంగిలించారు. దీంతో బాధితుడు ఆదిత్య (సీతానగరం మండలం) మరుచటి రోజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్సై సంతోషి ఆధ్వర్యంలో పోలీసులు సమీపంలో ఉన్న సీసీ కెమెరాల పుటేజీ ఆధారంగా మక్కువ మండలానికి చెందిన ఇద్దరు మైనర్ల నుంచి బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి


సర్వజన ఆస్పత్రిలో కృష్ణ మృతదేహం

గంట్యాడ: ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు తెలియజేసిన వివరాల మేరకు.. కొఠారుబిల్లి కనకదుర్గమ్మ ఆలయం వెనుక ఉంటున్న కురిమిశెట్టి కృష్ణ అనే వ్యక్తి ఇంటికి వెళ్తుండగా.. వెనుక నుంచి వచ్చిన ద్విచక్ర వాహనచోదకుడు ఢీకొట్టాడు. దీంతో కృష్ణ తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. గంట్యాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వీరఘట్టం: మండలంలోని తూడి జంక్షన్ వద్ద సీఎస్పీ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మీసాల తిరుపతిరావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి. పాలకొండ మండలం పొట్లి గ్రామానికి చెందిన తిరుపతిరావు వీరఘట్టం నుంచి తన స్వగ్రామానికి బైక్‌పై వెళుతుండగా.. పాలకొండ నుంచి పార్వతీపురం వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో తిరుపతిరావుకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు స్పందించి 108 వాహనంలో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు.

రామతీర్థానికి శ్రీరామనవమి శోభ

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రామతీర్థం శ్రీ రామస్వామి వారి దేవస్థానానికి శ్రీరామనవమి శోభ సంతరించుకుంది. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి కల్యాణ వసంతోత్సవాలు వేడుకగా ప్రారంభమయ్యాయి. వేకువ జామున స్వామికి సుప్రభాత సేవ, బాలభోగం తదితర కార్యక్రమాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం ఆస్థాన మండపంలోనికి స్వామివారిని వేంచింపజేసి విశ్వక్సేనారాధన, అంకురారోపణ, ఋత్విగ్వరణం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన సుమారు 40 మంది ఋత్విక్కులచే ఈ నెల 6వ తేదీ వరకు శ్రీమద్రామాయణ, సుందరకాండ, సహస్ర నామ తులసీ దళార్చన, కుంకుమార్చనలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఆ రోజు శ్రీరామనవమిని పురస్కరించుకొని సీతారాముల కల్యాణాన్ని వేడుకగా జరిపించనున్నారు.

వేద రుత్విక్కులచే పారాయణాలు

స్వామివారి ఆస్థాన మండపం వద్ద వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన రుత్విక్కులచే శ్రీమద్రామయణం, సుందరకాండ పారాయణాలు, సుదర్శన శతకం, నాలాయర దివ్య ప్రబంధ, తులసీ దళార్చన, కుంకుమార్చన కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం యాగశాలలో సుందరాకాండ, గాయత్రీ రామాయణాలు, సుదర్శన శతకం హోమాలను నిర్వహించి అగ్నిప్రతిష్ఠాపనను గావించారు.

గిరిజన రైతు కంట కన్నీరు..

- జీడిమామిడికి తెగుళ్ల దెబ్బ
- తగ్గనున్న దిగుబడి
- ఆందోళనలో రైతులు

సీతంపేట: గిరిజనుల ప్రధాన ఆదాయ వనరుగా భావిస్తున్న జీడిపంట ఈ ఏడాది దెబ్బతింది. అగ్గి తెగులు వల్ల కొన్ని ప్రాంతాల్లో పూత మాడిపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. పూర్తిస్థాయిలో దిగుబడి రాకపోవడంతో గిరిజనులకు ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. అధిక ఉష్ణోగ్రత, తేనె మంచుతో పూత రాలేదు. అక్కడక్కడ తోటల్లో కొద్దిపాటి పూత వచ్చిందంటే అది కూడా మాడిపోయింది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో టీపీఎంయూ పరిధిలోని ఏడు మండలాల్లో దాదాపు 15 వేల హెక్టార్లలో జీడిపంట సాగవుతుండగా.. ఈ పంటపై సుమారు 12 వేల మంది రైతులు ఆధారపడి ఉన్నారు. ఏప్రిల్, మే నెలల్లో పంట చేతికందాల్సి ఉంది. అయితే ఈ ఏడాది సుమారు ఐదువేల హెక్టార్లలలో కూడా పంట పూర్తి స్థాయిలో పండిన దాఖలాలు లేవు. గతంలో ఈ సీజన్‌లో సుమారు రెండు నుంచి మూడు వేల టన్నుల వరకు జీడిపిక్కల దిగుబడి ఉండేది. ఈ ఏడాది వెయ్యి టన్నుల లోపు కూడా దిగుబడి వచ్చే అవకాశం కనిపించడం లేదని రైతులు చెబుతున్నారు. ప్రతి ఏటా ఒక్కో గిరిజన కుటుంబానికి జీడి పంట వల్ల రూ.50 వేల నుంచి 2 లక్షల రూపాయల వరకు ఆదాయం వచ్చేది. ఈ ఏడాది రూ.20 వేలు కూడ వచ్చే అవకాశం లేదని రైతులు చెబుతున్నారు. ఎక్కువగా కుశిమి, కోడిశ, శంభాం, కె.గుమ్మడ, దోనుబాయి, పొల్ల, పెదరామ, మర్రిపాడు, పూతికవలస, చిన్నబగ్గ, పెద్దబగ్గ, కీసరజోడు, తదితర పంచాయతీల పరిధిలో జీడి ఎక్కువగా సాగవుతోంది. ఉద్యానవన పంటలను ప్రోత్సాహించాలనే ఉద్దేశంతో గతంలో ఐటీడీఏ కూడా జీడిమామిడి మొక్కలు సరఫరా చేసింది. అవి కూడా సరైన దిగుబడి ఇవ్వకపోవడంతో ఏం చేయాలో తెలియక రైతులు తలలు పట్టుకుంటున్నారు.


మాడిన జీడి పూత

పరిశీలిస్తాం..



ఐటీడీఏ పరిధిలో ఎక్కడెక్కడ పంటలు నష్టపోయినదీ పరిశీలిస్తాం. తెగుళ్ల నివారణకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనేది రైతులకు ఇప్పటికే సూచనలు, సలహాలు ఇచ్చాం. తేనెమంచు, అగ్గితెగులు వంటివి సోకి పంట నష్టపోతే బీమా పరిహారం కూడా రైతులకు వస్తుంది. – పి.జయశ్రీ, హెచ్ఓ, సీతంపేట

ఆదుకోవాలి..



ప్రతి ఏటా జీడి పంట ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇతర పంటలకు పెట్టుబడిగా పెట్టేవాళ్లం. ముఖ్యంగా ఖరీఫ్‌లో పండే వరికి మదుపులు పెట్టడానికి ఈ పంటే ఆదాయం. ఇప్పుడు జీడిపంట పోవడంతో ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి. – వి.చలపతి, రైతు, మర్రిపాడు

చీకటిలోనే రాకపోకలు..


విద్యుత్ లైట్లు లేనికారణంగా చీకటిగా ఉన్న రహదారి

- ఇబ్బందిపడుతున్న ప్రజలు

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రమైన పార్వతీపురం పట్టణ ప్రారంభంలో రహదారికి ఇరువైపులా విద్యుత్ దీపాలు లేకపోవడంతో అంధకారం నెలకొంది. దీంతో చీకటిలోనే రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రీయ రహదారికి అనుసరించి ఉన్న వైకేఎం కాలనీ, వసుంధర నగర్, శక్తినగర్, ఆఫీషియల్ కాలనీ, విద్యానగర్ వరకు రహదారికి ఇరువైపులా విద్యుత్ లైట్లు లేవు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు సాయంత్రం ఏడు దాటితే ఇంటి నుంచి బయటకు రావడానికే భయపడుతున్నారు. ఉద్యోగస్తులు, విద్యార్థులు తప్పనిసరి పరిస్థితుల్లో చీకటిలోనే భయం భయంగా ఇంటికి చేరుకుంటున్నారు. అధికారులు స్పందించి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆయా ప్రాంతాల వాసులు కోరుతున్నారు.

పిల్లలు ఇబ్బంది పడుతున్నారు



పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు ప్రత్యేక తరగతులు ముగించుకుని ఇంటికి వచ్చే సమయానికి చీకటి పడడంతో ఇబ్బంది పడుతున్నారు. వారు ఇంటికి చేరుకునేంత వరకు భయంభయంగా ఉంటోంది. విషసర్పాలు, కీటకలు ఎక్కువగా సంచరిస్తుంటాయి. అధికారులు స్పందించి లైట్లు వేయాలి.
– ఎం.గిరిప్రసాద్, వసుంధర్‌నగర్

ప్రమాదాలు జరిగే అవకాశం..



రాష్ట్రీయ రహదారి కావడంతో భారీ వాహనాలు అతివేగంతో రాకపోకలు సాగిస్తుంటాయి. విద్యుత్ దీపాలు లేకపోవడంతో వాహనం వెళ్లిపోయిన తర్వాత కాసేపు రోడ్డు కనిపించడం లేదు. ఆ సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వీధి లైట్లు ఏర్పాటు చేయాలి.
– గండి రాంబాబు, విద్యానగర్

పేరాపురంలో దొంగతనం

- నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రెండు లక్షల రూపాయల నగదు అపహరణ

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం గ్రామంలో దొంగతనం జరిగింది. బాధితులు, పోలీసులు తెలియజేసిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన గురుగుబిల్లి కసవయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 26న తిరుపతి వెళ్లాడు. దర్శనం అనంతరం 29వ తేదీ అర్ధరాత్రి ఇంటికి చేరుకున్నారు. ఆ సమయంలో ఇంటి తలుపు తెరిచి ఉండడంతో వెంటనే లోనికి వెళ్లి చూడగా బీరువాలోని నాలుగు తులాల బంగారు ఆభరణాలు, రెండు లక్షల రూపాయల నగదు కనిపించలేదు. వెంటనే స్థానిక పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేయగా.. ఎస్సై ఐ. దుర్గాప్రసాద్, తదితరులు ఆదివారం గ్రామానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. బీరువాను క్షుణ్ణంగా పరిశీలించి, తెలిసిన వారు దొంగతనం చేశారా.. బయట వ్యక్తులు వచ్చారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.


బంగారం, నగదు పోయిన బీరువా ఇదే

వంశధార దాటిన ఏనుగులు



భామిని మండలంలోని ఒడిశా సరిహద్దుగా ఉన్న వంశధార నదీ ఆవల గల ఒడిశా తీరంలో ఏనుగుల గుంపు ఆదివారం ఉదయం కనిపించాయి. ఇటీవల భామిని – లివిరి గ్రామాల మధ్య తిరుగాడిన నాలుగు ఏనుగులు నది ఆవల గల ఒడిశా గ్రామాలైన గౌరీ – వన్న గ్రామాల మధ్యకు చేరాయి. వేసవి తాకిడి తట్టుకోలేక నీటి కోసం అల్లాడుతున్నట్టు భావిస్తున్నారు. ఈ క్రమంలో ఒడిశా తీరంలోని పచ్చని పంట పొలాల్లో ఏనుగులు తిరుగుతూ పంటలను నష్టపరుస్తున్నాయి. – భామిని

గంజాయితో ఒకరి అరెస్ట్

విజయనగరం క్రైమ్: గంజాయి తరలిస్తున్న ఒకరిని వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. భోగాపురం మండలం రెడ్డికంచేరుకు చెందిన గాబు దుర్గారావు కేజీన్నర గంజాయిని రాయగడ నుంచి రైలులో తీసుకువచ్చి నగరంలోని గూడ్స్‌షెడ్ వద్ద సంచరిస్తున్నాడు. ఈ విషయం పోలీసులకు తెలియడంతో సీఐ శ్రీనివాస్ ఆదేశాల మేరకు ఎస్సై రామగణేష్ సిబ్బందితో అక్కడ మాటు వేసి నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా.. న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు.

‘పైడితల్లి’కి ఉగాది శోభ

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయం ఆదివారం ఉగాది శోభను సంతరించుకుంది. ఆలయ ఇంచార్జ్ ఈఓ కెఎన్‌విడి వి.ప్రసాద్ నేతృత్వంలో అమ్మవారికి పుష్పాలంకరణలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం అమ్మవారికి బూరెలతో నివేదన చేశారు. ఆలయమంతా పుష్పాలతోనూ, యాపిల్ పండ్లు, ద్రాక్ష పండ్లతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఉగాది పర్వదినం పురస్కరించుకుని వేదపండితులను ఘనంగా సత్కరించి వారికి నగదు పురస్కారాలను అందజేశారు. స్థానిక రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి ఆవరణలో అమ్మవారికి నేతేటి ప్రశాంత్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో వేదపండితులు రాళ్లపల్లి రామసుబ్బారావు పంచాంగ శ్రవణం చేశారు. కార్యక్రమంలో వేదపండితులు దూసి శివప్రసాద్, తాతా రాజేష్, సాయికిరణ్, నరసింహమూర్తి, దూసి కృష్ణమూర్తిలు సహకార మందించారు.


పుష్పాల అలంకరణతో శ్రీ పైడితల్లి అమ్మవారు

జూదరుల అరెస్ట్

లక్కవరపుకోట: మండలంలోని కిత్తన్నపేట గ్రామ శివారులో రహస్యంగా నిర్వహిస్తున్న కోడిపందాలపై ఎస్సై నవీన్ పడాల్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ముగ్గురు జూదరులను అదుపులోకి తీసుకోవడంతో పాటు నాలుగు కోడి పుంజులు, రూ. 5 వందల నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్ పడాల్ తెలిపారు.

ఏడుగురు..

డెంకాడ: మండలంలోని కె.ముంగనాపల్లి ప్రాంతంలో పేకాటాడుతున్న వారిని పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు, పూసపాటిరేగ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పేకాట స్థావరంపై దాడి చేయగా ఏడుగురు నిందితులు పట్టుబడ్డారు. వారి నుంచి రూ. 75,790 నగదు, కారు, రెండు ద్విచక్ర వాహనాలు, ఏడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సన్యాసినాయుడు తెలిపారు.

ఇద్దరు..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట గ్రామంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం రాత్రి దాడులు నిర్వహించారు. తమకి వచ్చిన ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా.. బహిరంగ ప్రదేశంలో పేకాటాడుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 7,100 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఈ జాబ్ చాలా లక్కీ!

- పార్వతీపురంలో పని చేయడం గొప్ప అనుభూతి
- అమ్మాయిలు ఎందులోనూ తక్కువ కాదు
- లక్ష్యం కోసం నిరంతరం శ్రమిస్తే విజయం సులువే
- ప్రతి కేసునూ ఛాలెంజింగ్‌గా తీసుకుంటా..
- మహిళల భద్రత.. చైతన్యం ప్రథమ కర్తవ్యం
- ‘సాక్షి’తో ఏఎస్పీ అంకిత సురానా

సాక్షి, పార్వతీపురం మన్యం:

సాక్షి ఇంటర్వ్యూ



“మహిళలను వెన్నుతట్టి ప్రోత్సహిస్తే ఏ రంగంలోనైనా విజేతలవుతారు. అమ్మాయిలు ఇష్టమైన రంగాన్ని ఎంచుకోవాలి. డాక్టర్, పోలీస్, ఇంజినీర్.. ఇలా ఏదైనా సరే! దాన్ని సాధించేందుకు ఎదురైన ప్రతి సవాల్‌నూ ఛాలెంజింగ్‌గా తీసుకోవాలి. ఎవ్విరి థింగ్ ఈజ్ పాజిబుల్.. కష్టపడితే గెలుపు మన ముందు వచ్చి వాలుతుంది..”

“పార్వతీపురం మన్యం జిల్లా లాంటి ఏజెన్సీ ప్రాంతంలో పని చేయడం గొప్ప అనుభూతినిస్తోంది. ఇక్కడ గిరిజన జనాభా అధికం. నిరక్షరాస్యత కూడా ఉంది. గత కొన్నేళ్లుగా కొంత మార్పు కనిపిస్తోంది. బాలికలు విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో ప్రావీణ్యం పొందుతున్నారు. వారిలో మరింత చైతన్యం తీసుకొచ్చేందుకు నా వంతుగా ప్రయత్నిస్తున్నా. పాఠశాలలు, కళాశాలలకు స్వయంగా వెళ్లి వివిధ అంశాలపై వివరిస్తున్నా. కేవలం భద్రతనే కాదు.. కెరియర్ కోసం కూడా వివరిస్తుండటం సంతృప్తినిస్తోంది.”

చిన్నప్పుడు అందరిలానే తనూ ఒక సాధారణ అమ్మాయి. చదువు, ఆటపాటలే లోకం. డిగ్రీ చదువుతున్న సమయంలో.. సమాజంలో తన పాత్ర ఏమిటో అవగతమైంది. ఈ సొసైటీకి.. ప్రధానంగా మహిళలు, బాలికల కోసం ఏం చేయాలన్న ప్రశ్నలోనే.. ‘ఐపీఎస్’ అన్న లక్ష్యం బోధపడింది. ఆమే.. యువ ఐపీఎస్ అధికారిణి, పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురాన. అత్యున్నతమైన ఇండియన్ పోలీస్ సర్వీస్‌కు ఎంపిక కావడమే కాదు.. శిక్షణలోనూ ప్రతిభను చూపారు. నేడు విధి నిర్వహణలోనూ ‘ఫ్రెండ్లీ పోలీస్’ అన్న పదానికి అసలైన నిర్వచనం చెబుతూ, క్లిష్టమైన కేసుల్లోనూ తన మార్కు చూపిస్తూ.. విజయవంతమైన అధికారిణిగా గుర్తింపు పొందారు. రాష్ట్రానికి మారుమూలన ఉన్న పార్వతీపురం మన్యం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, యువతకు దిశానిర్దేశం చేయడంలో ముందుంటున్నారు. తన కుటుంబ నేపథ్యం, ఈ రంగంలోకి రావడానికి కారణం, విధి నిర్వహణలో సక్సెస్‌ఫుల్ జర్నీని ‘సాక్షి’తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే...

కుటుంబ నేపథ్యం..

మా సొంత ప్రాంతం మహారాష్ట్ర. పదో తరగతి వరకు అక్కడే చదివా. తర్వాత కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. ఇంటర్ (బైపీసీ) తర్వాత హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో బీఎస్సీ బయోకెమిస్ట్రీ డిగ్రీ, సల్సార్ యూనివర్సిటీలో క్రిమినల్ జస్టిస్ మేనేజ్‌మెంట్‌లో పీజీ పూర్తిచేశా. తల్లిదండ్రులు కౌసల్య, మహవీర్ సురానా. నాన్న వ్యాపార రంగంలో ఉన్నారు. ఇంట్లో ఎవరూ ప్రభుత్వ ఉద్యోగంలో లేరు. అందరూ ప్రైవేట్ ఉద్యోగాలు, వ్యాపారాలే. మా కుటుంబం నుంచి నేను మొదటి పోలీస్ అధికారి కావడంతో మా కుటుంబ సభ్యులు ఎంతో సంతోషంగా ఉన్నారు. డిగ్రీలో ఉంటుండగానే కెరియర్ కోసం ఆలోచించా. సమాజానికి సేవ చేయాలని, ప్రజలకు దగ్గరగా ఉండే వృత్తిలో చేరాలని కోరిక. ఆ క్రమంలోనే సివిల్స్ వైపు వెళ్లాలని నిర్ణయించుకున్నా. డిగ్రీ చదువుతూనే.. సివిల్స్ ప్రిపరేషన్ ప్రారంభించాను. లక్ష్యంపైనే గురి. మూడుసార్లు విజయం రాకపోయినా ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. నాలుగో ప్రయత్నంలో సివిల్స్ సాధించాను. 398వ ర్యాంకు వచ్చింది. ఐపీఎస్‌కు ఎంపికయ్యా. 2021 బ్యాచ్ మాది.

శిక్షణ తర్వాత చాలా మార్పు

సివిల్స్ సాధించిన తర్వాత శిక్షణ పూర్తయ్యాక నాలో చాలా మార్పు వచ్చింది. పట్టుదల పెరిగింది. ప్రజలకు సేవ చేయడాన్ని స్ఫూర్తిగా తీసుకున్నా. బాలలు, మహిళల రక్షణ కోసం పని చేయాలని అనిపించింది. ఈ రంగంలో తల్లిదండ్రులు ఎంతగానో ప్రోత్సహించారు. 2023లో గ్రేహౌండ్స్‌లో విశాఖలో విధుల్లో చేరా. తర్వాత పార్వతీపురం ఏఎస్పీగా వచ్చా. ఈ జాబ్ పొందడం చాలా లక్కీ!

మరిచిపోలేని అనుభూతి..

రాష్ట్రస్థాయి రిపబ్లిక్‌డే వేడుకల పరేడ్ కమాండర్‌గా వ్యవహరించడం మరిచిపోలేని అనుభూతి. గర్వపడే సందర్భం. చాలా ఆనందం అనిపించింది. ఒక వారం శిక్షణ పొంది విజయవంతంగా పరేడ్ పూర్తి చేయగలిగాం. నాకు అవకాశమిచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా.

నేటి తరానికి ఇచ్చే సందేశం..

నథింగ్ ఈజ్ ఇంపాజిబుల్. ఎవ్విరిథింగ్ ఈజ్ పాజిబుల్. నేటి తరం బాలికలు, యువతకు చెప్పేదొకటే. విద్యార్థి దశలో చదువు, కెరియర్‌పైనే దృష్టి పెట్టాలి. మీరు ఏ రంగంలో రాణించాలనుకుంటున్నారో గట్టిగా నిర్ణయించుకోవాలి. దాని సాధన దిశగా సాగాలి. పదో తరగతి తర్వాత కెరియర్ కౌన్సెలింగ్ చాలా ముఖ్యం. ఈ దశలో ఇతర విషయాల జోలికి వెళ్లకుండా, అనవసరంగా సమయం వృథా చేయకుండా భవిష్యత్తు కోసం ఆలోచిస్తే.. మంచి జీవితం లభిస్తుంది.

ప్రజలకు పోలీసులు ఉన్నారన్న నమ్మకం పెరగాలి

నేను ఎక్కడ పనిచేసినా.. అక్కడ ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు, చిన్నారులకు భద్రత కల్పించగలిగితే చాలు.. అంతకంటే సంతృప్తి ఉండదు. ప్రత్యేకించి మహిళలు, చిన్నారులకు పోలీస్‌పై నమ్మకం పెంచేలా పనిచేయగలగాలి. విధి నిర్వహణలో ప్రతి కేసునూ సవాల్‌గానే తీసుకుంటా. పోక్సో కేసులు, వరకట్నం, ఎస్సీ, ఎస్టీ కేసులు, శాంతిభద్రతలు.. ఇలా ఏదైనా బాధితులకు న్యాయం చేయాలి. అప్పుడే విధి నిర్వహణలో సంతృప్తి చెందగలం. మహిళల హక్కులు, చట్టాలపైన అవగాహన కల్పిస్తున్నాం. మహిళా దినోత్సవం సందర్భంగా కొవ్వొత్తుల ర్యాలీ, ఇతర కార్యక్రమాలు చేశాం. చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయి. ఏ ఒక్కరూ భయపడకూడదు. ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలి. ఇటీవల ఒక పోక్సో కేసు వచ్చింది. ఆ అమ్మాయి చాలా డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. వారం రోజులు కౌన్సెలింగ్ ఇచ్చాం. ఇప్పుడు ఆ అమ్మాయి చాలా హ్యాపీగా ఇంటర్ పరీక్షలు రాసుకుంటోంది.


పాచిపెంట మండలం పి.కోనవలస చిన్నారులతో ఏఎస్పీ

శాంతిభద్రతల పరిరక్షణలో...

డ్రోన్ నిఘా వ్యవస్థను పటిష్టం చేశాం. ఈవ్ టీజింగ్, జూదం, గంజాయి, సారా అక్రమ రవాణా వంటివాటిని డ్రోన్‌ల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ, కట్టడి చేస్తున్నాం. ప్రతి ముఖ్య కూడళ్లలోనూ సీసీ కెమెరాలు పెట్టాం. జిల్లాలో టాప్ 20 నేరస్తులను గుర్తించాం. వారిపై నిరంతరం ఓ కన్నేసి ఉంచుతున్నాం. మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా శక్తి యాప్ అందుబాటులోకి వచ్చింది. ఇందుకోసం పార్వతీపురం, పాలకొండ, సాలూరుల్లో టీమ్స్ పని చేస్తున్నాయి. వీరికి ప్రత్యేకంగా ఓ వాహనం ఉంటుంది. 100, 112 నంబర్లకు కూడా అత్యవసర సమయంలో ఫిర్యాదు చేయవచ్చు. నిమిషాల వ్యవధిలోనే పోలీసులు అక్కడ ఉంటారు. గంజాయి, సారా రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నాం. కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. బాలికల కోసం స్వీయ రక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలి.. ఏ విధంగా రక్షణ పొందాలి, భవిష్యత్తును మంచిగా తీర్చిదిద్దుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. పాఠశాలల్లో ఈగల్ టీమ్స్ ద్వారానూ అవగాహన పెంచుతున్నాం. చిన్నారులు, మహిళల రక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్ ఉంది. అక్కడ వారికి అవసరమైన అన్ని విధాల మద్దతు కూడా లభిస్తుంది. సైబర్ క్రైమ్ మోసాలు రోజుకో విధంగా కొత్త రూపు సంతరించుకుంటున్నాయి. ప్రజలు వాటి బారిన పడకుండా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు ఆయా ఎస్‌హెచ్‌వోల ద్వారా చేపడుతున్నాం. పోలీస్ సిబ్బంది సొంత సమస్యలపైనా ప్రతి శుక్రవారం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించి, ఫిర్యాదులు స్వీకరిస్తున్నాం.

ప్రజల సహకారం ఉంటేనే..

ప్రజలను సురక్షితంగా ఉంచడం బాధ్యత. ఇదే సమయంలో శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖపరంగా ఎంత చేసినా.. ప్రజల నుంచీ సహకారం అవసరం. ట్రాఫిక్ రూల్స్ పాటించడం, ప్రయాణ సమయంలో హెల్మెట్ ధారణ వంటి వాటిలో ఎవరికివారు బాధ్యతగా వ్యవహరించాలి. పిల్లలు తప్పుడు దారిలో వెళ్లకుండా తల్లిదండ్రులు పర్యవేక్షణ చేయాలి. సమాజంలో ప్రధానంగా పోలీసులంటే భయం పోవాలి. 24 గంటలూ పోలీసులు అందుబాటులో ఉంటారు. ఏ సమయంలోనైనా ధైర్యంగా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలి. చుట్టుపక్కల అసాంఘిక కార్యకలాపాలు జరిగినా.. ఒక్క ఫొటో ద్వారానైనా శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఇతర పోలీస్ శాఖ టోల్‌ఫ్రీ నంబర్లనూ వినియోగించవచ్చు. శక్తి యాప్.. సేఫ్టీయాప్. ప్రధానంగా మహిళల వద్ద ఉండాలి. ఒక్క బటన్ ప్రెస్ చేస్తే పోలీసులు ఉంటారు.


సాలూరు మండలం మర్రిపల్లి గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ అంకిత సురానా (ఫైల్)